# "రాముడు"

సుధ: అమ్మా! చెల్లెలుమాట్లాడడం లేదే

రమణమ్మ: ఎందుకుమాట్లాడదు కాసేపు అయితే అదే మాట్లాడుతుంది.

సుధ: అదికాదే, అది నిన్నటినుంచి అదోలావుంది.

రమణమ్మ: అదోలా వుండడ మేమిటే?

సుధ: (నెమ్మదిగా) అమ్మా! నీకు చెల్లెలంటే చాలా యిష్టం కదూ?

రమణమ్మ: (మాట్లాడదు)

సుధ: చెప్పవేమే?

రమణమ్మ: ఏమి చెప్పనే?

సుధ: నాన్నకికూడా చెల్లెలంటేనే యిష్టం.

రమణమ్మ: ఓయ్, వింటున్నారా? మిమ్మల్నే- సుధ ఏమంటున్నదో?

సీతారామయ్య: (పడకగదిలోంచి వండేయింట్లోకివస్తూ) ఉదయం లేవడంతోనే తీరిగ్గా కబుర్లుచెప్పుకుంటున్న నీకు తెలుస్తుందికాని, అదేమంటున్నదో నా కెల్లా తెలుస్తుంది.

రమణమ్మ: అదేమిటండీ, అల్లామాట్లాడుతారు?

సీతారామయ్య: పోనీ ఎల్లామాట్లాడాలో చెప్పు. నువ్వు చెప్పినట్లల్లా మాట్లాడుతాను.

రమణమ్మ: మీ మాటలు ఎవరైనావింటే నవ్విపోతారు. పిల్లలు ఎదుగుతున్నారని కూడా మీకు ఆలోచన వుండదు.

సీతారామయ్య: అవును, ఆమాటనిజమే రోజూ రాత్రి పడుకునే టప్పుడు "నాప్రవర్తన మార్చుకోవాలి, మార్చుకోవాలి" అనుకుంటాను-ఉదయం లేచేసరికి అంతా మర్చిపోతాను.

రమణమ్మ: మీ మాటలకి నవ్వాలో ఏడవాలో తెలియదు.

సీతారామయ్య: అందరికిమల్లే మనంకూడా నవ్వడందేనికి? ఏడుస్తేనే ప్రత్యేకత వుంటుంది.

రమణమ్మ: నవ్వడం నేర్పారు - ఇంక కష్టపడి ఏడ్వడం నేర్పండి.

సీతారామయ్య: నవ్వే ఆడదాన్ని ఏడ్చేమగవాణ్ణి నమ్మకూడదంటారు.

రమణమ్మ: మీ కబుర్లువింటే, ఇంకనాకు కడుపు నిండినట్టే రోజూ పుట్టే కూడుకూడా పుట్టదు.

సీతారామయ్య: ఆసంగతి నాకూతెలుసు. అందుకోసమే ఉదయం లేవడంతోనే నేను నీ మొహం చూడొద్దనుకుంటాను.

రమణమ్మ: మీ ఆకతాయి కబుర్లు వినలేక అమ్మాయికూడా
ఇక్కడినించి వెళ్ళిపోయింది.

సీతారామయ్య: ఇంతకీ నన్ను ఎందుకుపిలిచినట్టు.

రమణమ్మ: కబుర్లలోపడి చెప్పడం మర్చిపోయాను. మని
ద్దరికీ, సుగుణ అంటేనే చాలా యిష్టమట.

సీతారామయ్య: ఆమాట ఎవరన్నారు నీతో?

రమణమ్మ: ఉదయం లేవడంతోనే సుధ పనికట్టుకుని నా
దగ్గరకివచ్చి, ఆమాట కాస్తాచెప్పి చక్కా వెళ్లింది.

సీతారామయ్య: మరి నువ్వుఏమన్నావు?

రమణమ్మ: ఏమంటాను? ఆమాటకి నాకు చప్పున నవ్వొ
చ్చింది. నవ్వితే బాగుండదని మిమ్మల్ని పిల్చాను.

సీతారామయ్య: చాల్లే సంతోషించాను నీ తెలివికి.

రమణమ్మ: మరి సంతోషించినందుకు బహుమానమేదీ?

సీతారామయ్య: బహుమాన యేమివ్వమంటావో నువ్వే
ఆలోచించి కోరుకో.

రమణమ్మ: నిన్న రాముడిని వెళ్ళగొట్టినప్పటినుంచీ పుట్టెడు
చాకిరి నా నెత్తిమీద పడింది. ఇంకోపనిమనిషిని
కుదుర్చిపెడితే మీకు పుణ్యంవస్తుంది.

సీతారామయ్య: ఈ రోజుల్లో పనిమనిషి దొరకడమంటే
మాటలా? నిన్న వెళ్ళగొట్టేప్పుడే కాస్త ఆలోచించి

వెళ్ళగొట్టమని పదే పదే చెప్పాను. నువ్వు నా మాటలు వింటేగా?

రమణమ్మ: దొంగవెధవని ఎల్లా వుంచుకుంటామండి యింట్లో

సీతారామయ్య: ఆరూపాయి వాడుతీయలేదని నా అనుమానం

రమణమ్మ: అయితే పెద్దఅమ్మాయి అబద్దాలు చెబుతుందా?

సీతారామయ్య: రూపాయి ఎక్కడో పెట్టి మరిచిపోయి వుంటుంది.

రమణమ్మ: వచ్చేసంవత్సరాదికి తొమ్మిదేళ్ళు వస్తాయి. అది చిన్న పిల్లేమండీ, ఎక్కడో పెట్టి మరిచిపోవటానికి.

సీతారామయ్య: సుగుణని కనుక్కున్నావా? ఎక్కడన్నా కనపడిందేమో.

రమణమ్మ: రెడ్డివచ్చె మొదలాడ మన్నట్టుంది మీవ్యవహారం పోయినరూపాయి ఇంకెక్కడ దొరుకుతుందండీ.

సీతారామయ్య: సుగుణా! సుగుణా!

సుగుణ: వస్తున్నాను నాన్నా!

సీతారామయ్య: అమ్మా! రాముడు రూపాయితియ్యలేదు. అక్కయ్యే ఎక్కడో పెట్టి మర్చిపోయి వుంటుంది.

నువ్వు ఆరూపాయి చూచావా?

సుగుణ: రాముడే తీసాడని అక్కయ్య చెబుతున్నదే?

సీతారామయ్య: రూపాయిపోయిందని భయపడి అది రాముడి పైన నేరం వేస్తున్నది.

సుగుణ: కాదునాన్న! రాముడేతీసాడని అక్కయ్య అభిప్రాయం.

సీతారామయ్య: రాముడు తీయలేదనే నానమ్మకం. పోనీ నీ ఉద్దేశమేమిటో చెప్పు.

సుగుణ: (మాట్లాడదు).

సీతారామయ్య: చెప్పమ్మా! వాడు దొంగేనంటావా?

సుగుణ: చూడండి- వాడుదొంగని ఎల్లాచెప్పను నాన్నా!

సీతారామయ్య: వెధవరూపాయి, పోతేపోయింది. మనింట్లో వస్తువేదైనా పోవడం నువ్వెన్నడన్నా చూచావా?

సుగుణ: లేదు, చూడలేదు నాన్నా!

సీతారామయ్య: వాడు దొంగకాడనే నా ఉద్దేశం. మరి నువ్వేమనుకుంటావు.

సుగుణ: నేనూ అంతేఅనుకుంటాను. కాగా ఏపనిచెప్పినా ఎంతోచక్కగా చేసేవాడు.

సీతారామయ్య: (ఆలోచిస్తూ) సుధ ఎల్లప్పుడు వాడంటే చీదరించుకునేది. కారణం ఏమిటో తెలియదు.

రమణమ్మ: కారణమేముంది. పనిదొంగగనక చీదరి[illegible]
కుందేమో?

సీతారామయ్య: మధ్యలో అనవసరంగా నిన్నుమాట్లాడమన
లేదు?

సీతారామయ్య: సుగుణా, రాముడు పనిదొంగా?

సుగుణ: అక్కయ్య, పనిదొంగనే అంటుంది.

సీతారామయ్య: మరి నువ్వేమంటావు?

సుగుణ: (మాట్లాడదు.)

రమణమ్మ: దొంగ, దొంగ, దొంగ, ఒకటేమిటి లక్ష
సార్లుకూడా వాడు దొంగే.

సీతారామయ్య: నిన్నడిగానా వాడు దొంగఅవునో కాదో
చెప్పమని?

రమణమ్మ: నిజంచెప్పడానికి ఒకరు అడుగాలా ఏమిటి?

సీతారామయ్య: ఇదిగో, నేను నీతోమాట్లాడడంలేదు. నువ్వు
కాసేపు ఊరుకో.

సీతారామయ్య: చెప్పమ్మా- నీఅభిప్రాయమేమిటో?

సుగుణ: (మాట్లాడదు)

సుధ: చెప్పవేం, వాడు పనిదొంగకాడని? అక్కయ్యే
రూపాయిదాచిపెట్టి, వాడిపైన దొంగతనంపెట్టి వెళ్ళ
గొట్టించిందని చెప్పు.

సుగుణ: నేనా మాటన్నానా?

సుధ: ఇంకా అనాలేమిటి? అనకండానే తెలుస్తున్నది.

సుగుణ: అదేమిటక్కయ్యా, అల్లా మాట్లాడుతావు?

సుధ: ఎంత నంగనాచివే? నే నెల్లామాట్లాడుతున్నానో నీకు తెలియడం లేదన్నమాట-అంతేనా?

సుగుణ: నేనా నంగనాచిని?

సుధ: నువ్వెందుకు అవుతావు? ఈ ఇంట్లోకల్లా నేనేకదూ నంగనాచిని

సీతారామయ్య: ఎందుకమ్మా అలావిసుక్కుంటావు?

సుధ: అవును, నాన్నా, నేనెలామాట్లాడినా తప్పుగానే తోస్తుంది. సుగుణ, ఏమిమాటాడినా బాగానే వుంటుంది.

సీతారామయ్య: అదంటే ఎందుకమ్మా నీకు అంతకోపం?

సుధ: నాకెందుకుకోపం, నేనంటేనే మీకందరికికోపం?

సీతారామయ్య: నీమీద మాకెందుకు కోపంతల్లీ.

సుధ: లేకపోతే నేనేమన్నా మీ గారాబుకూతురినా, నామీద కోపం ఉండకపోవడానికి?

సీతారామయ్య: అది గారాబుకూతురై, నువ్వుకానిదెప్పుడు?

సుధ: అవునుమరి, అది నామీద ఎన్నిచాడీలుచెప్పినా, నేను మాత్రం ఏమీ అనకూడదు.

సీతారామయ్య: అదినీమీద చాడీలు చెబుతున్నదా అమ్మా?
సుధ: అదెందుకు చెబుతుంది - నేనే అసలు దానిమీద చాడీలు చెబుతున్నాను.
సీతారామయ్య: ఎందుకమ్మా అంత కఠినంగా మాట్లాడుతావు?
సుధ: కఠినంగా మాట్లాడేది నేనా, అదా?
సీతారామయ్య: ఎందుకుతల్లీ అంత బాధపడుతావు? అసలు సంగతేమిటోచెప్పు?
సుధ: ఈరోజు, అదా నేనా, తగుదునమ్మా అని వచ్చి ముందు చాడీలు చెప్పింది.
సీతారామయ్య: లేదమ్మా, అదినీమీద చాడీలు ఏమీచెప్పలేదు. నేనేపిలిచి, ఏవోప్రశ్నలడిగితే, సమాధానాలు చెబుతున్నది.
సుధ: ఆ సమాధానాలుచెప్పడానికి నేనుమాత్రం పనికిరాలేదు.
సీతారామయ్య: నిన్నూ అడుగుదామనే అనుకుంటున్నాను. కాని ఇంతలోకే....
సుధ: ఇంతలోకే నేనువచ్చి ఏదోగొడవ మొదలు పెట్టాను.
సీతారామయ్య: అదికాదమ్మ నాఉద్దేశం - ఇంతలోకే మీ అమ్మతో ఏవోకబుర్లలో పడ్డాను.
సుధ: ఈ యింట్లో నన్ను అందరూ తప్పించుకొని తిరిగే వాళ్ళే. అందరూ నన్ను కోప్పడేవాళ్ళే-కాని సుగుణ

అంటే అందరూ మెచ్చుకునేవాళ్ళే - చివరకి, ఆ రాముడి వెధవకి కూడా నేనంటేనే ఎంతో లోకువ.

సీతారామయ్య: పనిమనిషి నిన్నెందుకు లోకువగా చూస్తాడమ్మా.

సుధ: ఎందుకుచూస్తాడంటే? ఇంట్లో అందరూ లోకువగా చూస్తే వాడుచూస్తాడు. అంతే, అందులో వాడితప్పే ముంది?

సీతారామయ్య: పనిమనుషులదగ్గర - ఎంతోనేర్పుతో పని తీసుకోవాలమ్మా.

సుధ: ఆనేర్పు నాకెందుకుంటుంది. సుగుణకుంటుందిగాని అందుకోసమే అది ఏపనిచెప్పినా, వాడు ఎంతో అణుకువగా చేసేవాడు, అదే నేనుచెబితే ధుమధుమలాడేవాడు.

సీతారామయ్య: ఇప్పుడు మనకు సుగుణసంగతి ఎందుకమ్మా?

సుధ: అవును ఈ యింట్లో అందరూనన్ను కోప్పడేవాళ్ళే దాన్నిమాత్రం ఎవ్వరూ ఏమీఅనరు?

సీతారామయ్య: మళ్ళీ దానిసంగతి ఎందుకమ్మా మనకూ?

సుధ: అవును, దానిసంగతి నేనెందుకెత్తాలి? నిజమే, తప్పైంది. లెంపలేసుకుంటాను. ఆరాముడి సంగ

తెత్తడంకూడా నాదేపొరపాటు. అయినా వాడికితగిన శాస్తి చేసాను.

సీతారామయ్య: ఆఁ, ఏమిశాస్తి చేసావమ్మా?

సుధ: (మాట్లాడదు.)

సీతారామయ్య: చెప్పు? ఏమిశాస్తి చేసావు?

సుధ: ఏమీలేదునాన్నా - ఊరికేఅన్నాను.

సీతారామయ్య: ఇంతకుముందే శాస్తిచేసానన్నావు. ఇప్పుడు లేదంటున్నావు.

రమణమ్మ: లేదంటే ఎందుకండీ, మీరు దాన్ని పదేపదే అడుగుతారు.

సీతారామయ్య: నీకెందుకు నువ్వూరుకోరాదు. సుధా! చెప్పు.

సుధ: (మాట్లాడదు)

సీతారామయ్య: ఇంతకీ చెబుతావా లేదా?

సుధ: (ఏడుస్తూ) ఆరూపాయి.. నేనే.. దాచిపెట్టి . . . రాముడిమీద దొంగతనం . . . పెట్టాను.

సీతారామయ్య: ఎందుకల్లా చేసావు?

సుధ: (మాట్లాడదు).

సీతారామయ్య: (కఠినంగా) చెబుతావాలేదా?

సుధ: (ఏడుస్తూ) ఒకమాటిద్దరమూ బొమ్మలుకొనుకున్నాము సుగుణ కొనుకున్న మరునాడే తనబొమ్మ విరగ్గొట్టు

కుంది, నాబొమ్మఇవ్వమని అడిగింది. నేనివ్వకపోతే, ఏడుస్తూ అమ్మతో చెప్పింది. అప్పుడు నువ్వక్కడే వున్నావు. చిన్నదాన్ని ఎందుకేడిపిస్తున్నావు, ఆ బొమ్మ యివ్వమని మీరిద్దరూ నన్ను కోప్పడ్డారు. అయినా, నేనివ్వలేదు. ఇస్తే పాడుచేస్తుందని నా భయం. నేనివ్వకపోవడం చూచి అది మరీఏడ్చింది. అమ్మ కోపంగావచ్చి, నాబొమ్మ లాక్కుని దాని కిచ్చింది. అలా లాక్కున్నా నువ్వు అమ్మను ఏమీ అనలేదు.... నాకు అమ్మపైన, చెల్లెలిపైన, నీపైన అప్పుడు బాగా కోపమొచ్చింది. కొంతసేపటికి సుగుణవచ్చిఅక్కయ్యా! ఈబొమ్మతో మనం యిద్దరమూ ఆడుకుందామని వచ్చింది.... నేను బొమ్మ లాక్కుని విసిరి నేలకు కొట్టాను... దానితోఆ బొమ్మ నాలుగు ముక్కలైంది. . . బొమ్మ ఎందుకు పగలగొట్టావని, మీరిద్దరూ నన్ను కోప్పడ్డారు... ఒకమాటు అమ్మ నాకు కొద్దిగా మిఠాయిపెట్టి, సుగుణకు, నేను చూడకండా ఎక్కువపెట్టింది..... సుగుణేవచ్చి నాకు ఆమిఠాయి చూపించింది. . . . .

సుగుణ స్కూల్లో చేరినతరువాత, ఒకనాడు మా క్లాసుటీచర్‌తో సుగుణ చాలాచక్కగా చదువుకుం

టున్నదని వాళ్ల Teacher చెప్పింది. నువ్వు ఎందుకు చదువుకోవడం లేదని నన్ను కోప్పడింది... ఆ తరువాత మా క్లాసుటీచర్ ఎప్పుడూ చూచినా ఇదేపాట పాడేది. సుగుణని, ఇంట్లో బైటా అందరూ మెచ్చుకునేవాళ్ళే ... నన్ను అంతా కోప్పడేవాళ్ళే ...ఇంతలోకే రాముడు మనింట్లో పనికి కుదిరాడు. వాడికి కూడా ఎందుకో సుగుణ అంటేనే యిష్టం. ఆసంగతి చూచి, అమ్మతో వాడు రూపాయి దొంగతనం చేసాడని చెప్పి వాడిని వెళ్లగొట్టించాను.

సీతారామయ్య: పొరపాటంతా మాది. అంటే నాదీ, మీ అమ్మదీని. నిన్నని ఏమిలాభం లేదు. ఏదో సుగుణ చిన్నదని దాన్ని ప్రేమగా చూచాం. అదే నీకు కష్టంగా వుంటుందనీ, నీవు ఇల్లా అవుతావని మేము ఎన్నడూ అనుకోలేదు. పిల్లలు: మీరిద్దరూ మాకు సమానమే, కాని, మాప్రవర్తన నిన్ను తప్పుదారిలో పెట్టింది. దానికి మేమే కారకులం. ఒకవిధంగా నేరస్తులం కూడా. కాని దైవకృపవల్ల. అసలు సమయానికి అన్నిసంగతులు తెలిసి వచ్చాయి. ఇంక మిమ్మల్ని మేము చక్కదిద్దుకుంటాం.

సుధ: నాన్నా!

సీతారామయ్య: (కౌగలించుకుంటూ) తల్లీ.

సుగుణ: అక్కయ్యా!

రమణమ్మ: ఏమండీ మీకంతా పిచ్చెత్తిందా ఏమిటి?

సీతారామయ్య: అవును మనందరికి పిచ్చి ఎత్తింది. కాని
సమయానికి చక్కబడింది.

—o—